క్లుప్తంగా

ధనలక్ష్మి అమ్మవారి ఉత్సవాలకు అంకురార్పణ



చెముడులంకలో ధనలక్ష్మి అమ్మవారి ఉత్సవాలకు అంకురార్పణ చేస్తున్న కమిటీ బృందం

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో వేంచేసిన ధనలక్ష్మి అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలకు అంకురార్పణ జరిగింది. లంక గ్రామాల ప్రజలు ఇలవేల్పుగా భావించే అమ్మవారి ఉత్సవాలు జూలై మూడు నుంచి ప్రారంభం కానున్నాయి. అందులో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి తొమ్మిది రోజుల పాటు అమ్మవారు గరగ రూపంలో ప్రజలకు దర్శనమివ్వనున్నారు. అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాల సందర్భంగా జూలై మూడున సన్నాయి వాయిద్యాల మధ్య 108 కలశాలతో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు సర్పంచ్ తమ్మన శ్రీనివాసు తెలిపారు. నాలుగున జాతర, ఐదున తీర్థం జరుగుతుందన్నారు.

వెంకన్న నిత్యాన్నదానానికి విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి విరాళాలు అందినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. కొత్తపేటకు చెందిన ఎం.వీవీ సత్యనారాయణమూర్తి–లక్ష్మి నరసమ్మ దంపతులు రూ.10,116, కొంతమూరు గ్రామానికి చెందిన ఎం.వెంకటశేషప్రసాద్–నాగమణి దంపతులు రూ.15 వేలు, హైదరాబాద్‌కు చెందిన ఐ. వెంకట కృష్ణంరాజు, అవంతి దంపతులు రూ 10,011, రాజమహేంద్రవరానికి చెందిన జె.శేషలత రూ.10,116, విరాళాలు అందించినట్లు తెలిపారు. దాతలకు ఆలయ ఈఓ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందించారు.

రహదారికి మోక్షం



ఎట్టకేలకు అభివృద్ధికి నోచుకోనున్న పీర్మాయిపాలెంలో రహదారి

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం శివారు పీర్మాయిపాలెంలో అధ్వానంగా ఉన్న రహదారికి ఎట్టకేలకు అభివృద్ధికి నోచుకునే మోక్షం కలిగింది. అధ్వానంగా ఉన్న రహదారిని అభివృద్ధి చేయాలని 'సాక్షి' దినపత్రికల్లో వరుస కథనాలు వెలువడడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. పంచాయతీరాజ్ శాఖ అధీనంలో ఉన్న రహదారిని ఆర్‌అండ్‌బీ అధికారులకు త్వరలోనే బదలాయించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. పంచాయతీ రాజ్ నుంచి ఆర్‌అండ్‌బీకి బదలాయిస్తున్నట్లు ఉత్తర్వులు వచ్చిన వెంటనే నిర్మాణ పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్ అండ్‌బీ అధికారులు చెప్పారు. అందుకు సంబంధించి నిధులు కూడా మంజూరయ్యాయన్నారు.

రైతులకు సక్రమంగా సాగునీరు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వరి సాగు చేస్తున్న రైతులకు ఖరీఫ్ పంటకు సంబంధించి సాగునీటిని సక్రమంగా అందించాలని జిల్లా తెలుగు రైతు అధికార ప్రతినిధి ఈదల సత్తిబాబు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కాలువల్లోకి సాగునీరు ఈనెల ఐదున విడుదల చేసినా కొన్ని ప్రాంతాల్లోని ఉప కాలువలకు ఇంకా నీరు చేరలేదన్నారు. ఇకనైనా ఇరిగేషన్ అధికారులు సత్వరమే స్పందించి కాలువలను శుభ్రపరచాలని ఆయన డిమాండ్ చేశారు.

కుప్పకూలిన వంతెనను నిర్మించాలి

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరం మీదుగా మోడేకుర్రు వెళ్లేందుకు అప్పర కౌశిక డ్రైన్‌పై ఉన్న వంతెన ఏడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షానికి కుప్పకూలింది. ఈ వంతెనను 1979లో డ్రైయినేజీ శాఖ ఆధ్వర్యంలో నిర్మించారని స్థానికులు తెలిపారు. సుమారు నాలుగు దశాబ్దాల పాటు ఈ రెండు గ్రామాలకే కాకుండా ఎంతో మందికి బాటసారులకు, రైతులకు ఉపయోగపడింది. ఈ వంతెన కుప్పకూలడంతో రాకపోకలు స్తంభించాయి. ఈ వంతెన కుప్పకూలిపోయిందన్న విషయం టీడీపీ నాయకులకు, అప్పటి ప్రజాప్రతినిధులకు తెలిసినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించి పట్టించుకోలేదు. స్థానికులు అప్పటి ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళితే త్వరలో నిర్మిస్తాం. ప్రతిపాదనలు వెళ్లాయని మాయమాటలు చెప్పారే తప్ప ఆచరణలో కనికరించలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతు ఉత్పత్తులు తరలించేందుకు, స్థానికులకు ఎంతో అవసరమయ్యే ఈ వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

సెల్‌ఫోన్‌లు, బైక్ చోరీ

అంబాజీపేట: మండలంలో రెండు సెల్ ఫోన్‌లు, బైక్ చోరీకి గురయ్యాయి. మాచవరం శివారు గణేష్ కాలనీలో వాసంశెట్టి మురళీకృష్ణ ఇంటిలో ఉన్న రెండు సెల్‌ఫోన్లు ఆదివారం తెల్లవారుజామున చోరీకి గురయ్యాయి. అంబాజీపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం ఎదురుగా తూరంగికి చెందిన గుర్రం అశోక్‌కు చెందిన గ్లామర్ బైక్ చోరీకి గురైంది. వీరు ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

వెదజల్లు సాగు.. లాభాలు బాగు

- వెదజల్లు, డ్రమ్‌సీడర్‌తో అధిక దిగుబడులు
- వ్యవసాయంలో ఖర్చు తగ్గింపునకు దోహదం



ముక్కామలలో డ్రమ్‌సీడర్‌తో వరినాట్లు వేస్తున్న రైతులు (ఫైల్)

అంబాజీపేట: వరి సాగు లాభసాటి కావాలంటే ఖర్చులు తప్పనిసరిగా తగ్గించుకోవల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. రైతన్నలు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా సీఎం జగన్‌మోహన్ రెడ్డి అనేక యాంత్రీకరణ పద్ధతులను అందుబాటులోకి తీసుకువచ్చారు. రైతులకు వెన్నంటే ఉంటూ భరోసా కల్పించేలా ఆర్బీకేలను ఏర్పాటు చేసి చైతన్య పరుస్తున్నారు. వెదజల్లే పద్ధతిలో వరి సేద్యం చేస్తే ఎకరాకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకూ ఖర్చు తగ్గుతుంది. వెదజల్లే పద్ధతిలో చేతితో వెదజల్లటం, డ్రమ్ము సీడర్ విధానం అనే రెండు పద్ధతులు ఉన్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మూడు నియోజకవర్గాలకు సంబంధించి కొత్తపేటలో 30,500, పి.గన్నవరం 22,250, రాజోలు 13,660 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు.

వెదజల్లే పద్ధతి...

పొలాన్ని 15 రోజుల ముందుగా దమ్ము చేసిన తరువాత విత్తడానికి 4 రోజుల ముందు మరోసారి దమ్ము చేసి సమానంగా చదునుచేసి మట్టి పేరుకున్న తర్వాత ప్రతి 2 మీటర్లకు 20 సెంటీమీటర్ల కాలువ చేయాలి. 8 సాళ్ళ పరికరంతో అయితే నీరు నిల్వ ఉండకూడదు. పూర్తిగా తీసివేయాలి. నీరు ఎక్కువయితే బయటకు తీసేందుకు ఏర్పాటు చేయాలి. కాండం గట్టిగా ఉండి పడిపోని వరి రకాలను ఎన్నుకోవాలి.

డ్రమ్ సీడర్‌తో...

డ్రమ్ సీడర్‌కు నాలుగు ప్లాస్టిక్ డ్రమ్ములుంటాయి. ప్రతి డ్రమ్ముకు 20 సెంటీమీటర్ల ఎడంగా రంధ్రాలుంటాయి. ఈ డ్రమ్ములో మొలకెత్తిన విత్తనాలను నింపి మూత బిగించాలి. గింజలు రాలడానికి వీలుగా డ్రమ్ములోని 3/4 వంతు మాత్రమే విత్తనాలు నింపాలి. ఈ డ్రమ్‌సీడర్ పొలంలో లాగితే 20 సెంటీమీటర్ల ఎడంగా గింజలు పడతాయి. ప్రతి 16 వరుసలకు అడుగు, వెడల్పు కాలిబాటలను ఏర్పాటు చేయాలి. తాడు లాగిన తరువాత డ్రమ్ లాగితే వరుసలు బాగా వస్తాయి.

కలుపు నివారణ



నేరుగా విత్తిన పొలాల్లో కలుపు బెడద ఎక్కువగా ఉంటుందని వ్యవసాయాధికారులు సూచించిన ఎరువులను వినియోగిస్తే కలుపు నివారణ తగ్గుతుందన్నారు. విచక్షణారహితంగా ఎరువులు, పురుగుల మందుల వాడకాలను తగ్గిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు.

– సీహెచ్‌డీ విజయకుమార్, ఏవో, అంబాజీపేట

ఎరువుల యాజమాన్యం..

భాస్వరం, పొటాష్ ఎరువులను మాత్రమే దమ్ములో వేయాలి. నేరుగా విత్తుతాం గనుక కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. అందుకని నత్రజని దమ్ములో వేయకూడదు. భాస్వరం మొత్తం దమ్ములో వేయాలి. పొటాష్‌ను మూడు భాగాలుగా విత్తిన 10–15 రోజులకు, 30–35 రోజులకు, 60–65 రోజులకు వేయాలి. మొక్కల మొదటి ఆకు పూర్తిగా విచ్చుకునే వరకు అంటే 7 నుంచి 10 రోజుల్లో ఆరుతడులు ఇవ్వాలి.

పేదల సంక్షేమమే సీఎం లక్ష్యం



కేవీ పోడులో లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు



పెదపట్నంలంకలో గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

సఖినేటిపల్లి: పేదల సంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం వీవీమెరక శివారు కేవీ పోడులో ఎమ్మెల్యే రాపాక అధికారులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. అర్హులకు పథకాలు సక్రమంగా అందుతున్నాయా, లేదా అని తెలుసుకుని, అందకపోతే అందించేందుకు అక్కడికక్కడే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పేదల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న సీఎం జగన్‌కు రానున్న ఎన్నికల్లో పూర్తి మద్దతు పలకాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ ఒగూరి రత్నకుమారి, ఎంపీటీసీలు ఇంజేటి కృష్ణవేణి, గుబ్బల ఆంజనేయులు, ఉపసర్పంచ్ చెంపాటి రామకృష్ణంరాజు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కారుపర్తి నాగేశ్వరరావు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి జగన్ భరోసా

మామిడికుదురు: కుల మతాలకు అతీతంగా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వేస్తోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం పెదపట్నంలంకలో జరిగింది. దీనిలో భాగంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వాటిని పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. చిట్టిబాబు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సీఎం జగన్ భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. గతంలో మాదిరిగా ఎవరి సిఫారసు లేకుండా, అవినీతికి తావు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. గత పాలనకు, నేటి పాలనకు బేరీజు వేసుకుని వైఎస్సార్ సీపీకి ప్రజలు అండగా నిలవాలన్నారు. తద్వారా అభివృద్ధి, సంక్షేమానికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరనీడి రాజేష్‌కుమార్, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, దేవస్థానం ట్రస్టీ కొమ్ముల సూరిబాబు, గ్రామ శాఖ అధ్యక్షుడు రాయుడు ఆనంద్, పార్టీ నేతలు జక్కంపూడి వాసు, విప్పర్తి నాగేశ్వరరావు, యల్లమెల్లి ఏడుకొండలు, ఆకుమర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అప్పనపల్లిని ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దుతాం



అప్పనపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయాన్ని మరింత ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన శిల్పి స్వర్గీయ పిల్లేడ నరసింహాచార్యులు, కూర్మాచార్యుల జ్ఞాపకార్థంగా కోమలాచార్యులు నిర్మించిన బాలబాలాజీ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన శంఖుచక్ర నామాలను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.1.50 లక్షలతో వీటిని ఏర్పాటు చేశారు. చిట్టిబాబు మాట్లాడుతూ అప్పనపల్లి ఆలయ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం మరువరానిదన్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, జెడ్పీటీసీ కసిరెడ్డి ఆంజనేయులు, ఆలయ ఈఓ జి.మాధవి, సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, ఎంపీటీసీ బొంతు నీలిమ, ట్రస్ట్ బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, పెదమల్లు ఉషారాణి, బత్తుల గంగారత్నం, గూటం శ్రీనివాస్, బొరుసు పార్వతి దుర్గాభవాని పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ కేంద్ర బృందం పర్యటన



ఇసుకపూడిలో తాగునీటి స్వచ్ఛతపై ఆరా తీస్తున్న కేంద్ర బృందం

అంబాజీపేట: జాతీయ జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా అంబాజీపేట మండలంలో ప్రజలకు అందిస్తున్న తాగునీటి స్వచ్ఛత, శుద్ధిపై కేంద్ర బృందం నాలుగు గ్రామాల్లో ఆదివారం పర్యటించి వివరాలను సేకరించింది. ఇసుకపూడి, కముజువారిలంక, పసుపల్లి, తొండవరం గ్రామాల్లో ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటి శుభ్రతను కేంద్ర బృందం ప్రతినిధులు గజాన్ఫర్ అహ్మద్, రాజ్‌కుమార్ బన్సాల్ పరిశీలించి గ్రామ సభలు నిర్వహించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా పంపిణీ చేస్తున్న తాగునీరు రంగు మారిందా, వాసన వస్తుందా, తాగునీరు సరఫరా చేసే ప్రాంతాల వద్ద పరిశుభ్రత పాటిస్తున్నారా అని స్థానిక మహిళలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి అవసరాలకు సరఫరా చేస్తున్న తాగునీటిలో మూలకాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు తరపట్ల మోహన్‌సింగ్‌బాబురావు, సరస్వతుల సుబ్రహ్మణ్య ప్రసాద్, మట్టపర్తి నాగరాజు, పేరాబత్తుల దొరబాబు, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్, సొసైటీ అధ్యక్షుడు బొంతు శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పద్మనాభం, ఏఈఈలు కళ్యాణ్ చక్రవర్తి, చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

బురదగా మారిన రోడ్డు.. తప్పని ఇబ్బందులు



అప్పనపల్లి ఉచ్చులవారిపేట మార్గంలో బురదగా మారిన అప్రోచ్ రోడ్డు

మామిడికుదురు: మామిడికుదురు నుంచి అప్పనపల్లి ఉచ్చులవారిపేట వెళ్లే మార్గంలో అప్రోచ్ రోడ్డు గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి బురదమయంగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు మార్గం అనువుగా లేకపోవడంతో పాశర్లపూడి కొండాలమ్మచింత సెంటర్ మీదుగా చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. కొర్లగుంట ఏటిగట్టు దిగువన పాడైపోయిన కాజ్‌వే స్థానే కొత్త కాజ్‌వే నిర్మాణం చేపట్టారు. ఈ కాజ్‌వే పనులు దాదాపు పూర్తి అయినప్పటికీ అప్రోచ్ పనులు మాత్రం పూర్తి కాలేదు. ప్రస్తుతం అప్రోచ్ పనులు నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వాహనాలతో పాటు ప్రయాణికుల రాకపోకలకు వీలుగా పాటురేవుపై అప్రోచ్ రోడ్డు నిర్మించారు. మట్టి, ఇటుక ముక్కలు, గ్రావెల్‌తో నిర్మించిన అప్రోచ్ రోడ్డు రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి చిత్తడిగా మారింది. దీంతో ఈ అప్రోచ్ రోడ్డుపై వాహనాలను నడిపించి తీసుకువెళ్లేందుకు కూడా అనువుగా లేదు. వాహనాలు జారిపోవడంతో పాటు ప్రయాణికులు కూడా కాలు జారి పడిపోతున్నారు. అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామాలకు వెళ్లే ప్రయాణికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పై మూడు గ్రామాలకు వెళ్లే వారికి ఈ మార్గం దగ్గరగా ఉంటుంది. ప్రతి రోజు ఈ మార్గంలో వందల సంఖ్యలో ప్రయాణికులు వెళ్తుంటారు. దీంతో పాటు అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయానికి వచ్చే భక్తులు సైతం ఈ దగ్గర మార్గం మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం అక్కడ నెలకొన్న సమస్యలను వెంటనే చక్కదిద్ది ప్రజలు ఇబ్బంది పడకుండా అప్రోచ్ రోడ్డును గ్రావెల్‌తో అభివృద్ధి చేయాలని ఆ మూడు గ్రామాల వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రధాని మోదీ పథకాలపై ప్రచారం



పాశర్లపూడిలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నేతలు



సఖినేటిపల్లిలంకలో ఇంటింటికీ కరపత్రాల పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

మామిడికుదురు: ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ పాశర్లపూడిలో బీజేపీ నేతలు ఆదివారం ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. కేంద్రంలోను, రాష్ట్రంలోనూ ఒకే పార్టీ అధికారంలో ఉంటే ఎంతో అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ నేతలు పసుపులేటి మహలక్ష్మీరావు, కటికిరెడ్డి గంగాధరమ్ పేర్కొన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారు ఆవశ్యకతను వివరిస్తూ కరపత్రాలు పంచారు. మోదీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో పయనించిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, యేడిద బాబులు, నక్కా త్రిలోచనరావు, బందారు పళ్లంరాజు, పిచ్చుక పోలేశ్వరరావు, ఆకుల రాము పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు తెలియజెప్పేందుకు కరపత్రాల రూపంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నట్టు బీజేపీ రాష్ట్ర కో ఆపరేటివ్ సెల్ డైరెక్టర్ మాలే శ్రీనివాస నగేష్ అన్నారు. ఆదివారం సఖినేటిపల్లిలంకలో ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలపై రాష్ట్ర పార్టీ ఆదేశాలపై గృహసంపర్క్ యోజనలో కరపత్రాల ద్వారా ఇంటింటికి బీజేపీ శ్రేణులు ప్రచారం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు చెంపాటి శివరామకృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన పై కార్యక్రమంలో శ్రీనివాస నగేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం కేంద్ర ప్రభుత్వ నిధుల సహకారంతోనే జరుగుతున్నాయన్నారు. పార్టీ జిల్లా నాయకుడు పట్టపు సూర్యప్రకాశరావు, పార్టీ ఉపాధ్యక్షుడు తిరుమల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పోతురాజు సురేష్, కార్యదర్శి జీవీవీ సత్యనారాయణ, బూత్ అధ్యక్షులు పడాల శ్రీను, కొనగాల దుర్గారావు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన నారు.. దిగుబడులు జోరు



ఆత్రేయపురంలో నారుమడి సస్యరక్షణపై రైతుకు సూచనలిస్తున్న అధికారులు

కొత్తపేట/ఆలమూరు: ఖరీఫ్ సాగుకు వాతావరణ అనుకూలించింది. వరి నారుమడులకు రైతుల శ్రీకారం చుడుతున్నారు. సాగు ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించేందుకు ఆరోగ్యకరమైన నారు పెంచడానికి నేల తయారీ దశ నుంచీ జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు కోరుతున్నారు.

నారుమడి తయారీ..

నారుమడి వేయటానికి ఎంచుకున్న నేల సారవంతమైనదై ఉండాలి. నారు పోయడానికి ఎప్పుడూ మెరక ప్రదేశాన్నే ఎంచుకోవాలి. ఎకరం విస్తీర్ణానికి 3 సెంట్ల నారుమడి తయారు చేయాలి. నారుమడిని 10–12 రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా దమ్ము చేసి చదును చేసి నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా గాడి తీసుకోవాలి. వీలైనంత వరకూ బాగా చివికిన సేంద్రియ ఎరువులను ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నుకోవాలి. కలుపు లేకుండా చూసుకోవాలి. దాంతో వేరు వ్యవస్థ దృఢంగానూ, నారు పీకేటప్పుడు తెగిపోకుండా ఉంటుంది.

64,866 ఎకరాల్లో ఖరీఫ్ సాగు

కొత్తపేట నియోజకవర్గంతో పాటు పి.గన్నవరం, రాజోలు వ్యవసాయ సబ్ డివిజన్‌లలో 64,866 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఆ విధంగా కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల్లో 28,956 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేపడుతున్నారు. పి.గన్నవరం సబ్ డివిజన్లో సుమారు 22,250 ఎకరాల్లో, రాజోలు సబ్ డివిజన్‌లో సుమారు 13,660 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

నారుమడులు త్వరగా పూర్తి చేయాలి

మొన్నటి వరకూ ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉన్నందున నారుమడులు వేసుకోవడానికి రైతులు ఆలోచించారు. ప్రస్తుతం వాతావరణం చల్లబడి సాగుకు అనుకూలంగా ఉన్నందున రైతులు యుద్ధప్రాతిపదికన నారుమడులు వేసుకోవాలి. నాట్లు పూర్తి చేయాలి. కోనసీమ ప్రాంతానికి అనుకూలమైన ఎంటీయూ 7029, ఎంటీయూ 1064, ఎంటీయూ 1061 వరి రకాలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. అయితే ఎంటీయూ 7029 (స్వర్ణ) రకం 80 శాతం మేర విస్తరించి ఉంది. ఈ రకం అధిక దిగుబడిని ఇస్తుంది. కానీ అననుకూల పరిస్థితుల్లో చేనుమీద పడిపోతుంది. దీని స్థానంలో మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం వారు విడుదల చేసిన ఎంటీయూ 1318 రకం అననుకూల పరిస్థితుల్లో కూడా నిలబడి ఉంటుంది. చేను మీద పడిపోదు. స్వర్ణకు దీటుగా దిగుబడినిస్తుంది. ఈ రకాన్ని సాగు చేసుకోవడం మంచిది.

– ఎం.వెంకటరామారావు, ఏడీఏ, కొత్తపేట

శరవేగంగా 'జీరో' షూటింగ్



మెర్లపాలెంలో షూటింగ్ నిర్వహిస్తున్న చిత్రబృందం

ఆత్రేయపురం: కోనసీమ సొగసులు వెండి తెరపై తళతళమని మెరవనున్నాయి. ఆత్రేయపురం మండలంలోని వివిధ గ్రామాల్లో జీరో సినిమా చిత్రీకరణ కోనసీమ అందాల నడుమ సుమారు 10 రోజుల పాటు ఒక సినిమాను తెరకెక్కించేందుకు వచ్చారు. హీరో విజయ్‌రాజ్, హీరోయిన్ ఎల్సా, తారాగాణం రాజేంద్రప్రసాద్, ఆమని, సంపత్‌రాజ్, తదితరులు నటించనున్నారు. సాయివిలాస్ బ్యానర్ నిర్మిస్తుండగా నిర్మాతగా లక్ష్మణరావు, కోడైరెక్టర్ శివ, సంగీతం సాయి కార్తిక్ అందించనున్నారు. ఈ చిత్ర నిర్మాణం ఇప్పటి వరకు 50 శాతం పూర్తయినట్లు డైరెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం మండలంలోని మెర్లపాలెం, లొల్ల తదితర గ్రామాల్లో చిత్రీకరించారు. ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం పూతరేకులు, పల్లె వాతావరణంపై చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి



చెముడులంకలో జగనన్న సురక్షపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ తమ్మన తదితరులు

ఆలమూరు: అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందించాలన్న ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ఇన్‌చార్జి, సర్పంచ్ తమ్మన శ్రీనివాసు కోరారు. మండలంలోని చెముడులంకలో ఆదివారం స్థానిక పార్టీ శ్రేణులు, గ్రామ వలంటీర్లతో కలసి ఇంటింటికీ పర్యటించారు. జగనన్న సురక్ష పథకం ఆవశ్యకతను వివరించి దరఖాస్తు చేసుకోవలసిన విధానాన్ని తెలియజేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో షెడ్యూల్ వారీగా గ్రామ సభలు నిర్వహించి అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శి యు.రేణుక, మాజీ సర్పంచ్ బుడ్డిగ వీర వెంకట్రావు, దొండపాటి చంటి, మోటూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం



దాత రమణమూర్తికి స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ప్రధానార్చకుడు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్ పటాన్‌చెరుకు చెందిన రమణ టూర్స్, ట్రావెల్స్ యజమాని రాయుడు వీవీ రమణమూర్తి ఆదివారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును చెక్ రూపంలో ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తికి అందజేశారు. దాతను వేదపండితులు వేదాశీర్వచనం, స్వామివారి శేషవస్త్రాలు సత్కరించి స్వామి చిత్రపటం అందజేశారు.

ఎలక్ట్రికల్ ఇన్‌చార్జ్ ఏఈగా హరిబాబు



ఇన్‌చార్జ్ ఏఈ హరిబాబును అభినందిస్తున్న సిబ్బంది

అయినవిల్లి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎలక్ట్రికల్ ఇన్‌చార్జ్ ఏఈగా హరిబాబు నియమితులయ్యారు. ఇప్పటివరకూ హరిబాబు అయినవిల్లి సబ్‌స్టేషన్ ఎలక్ట్రికల్ ఏఈగా పనిచేస్తూ అమలాపురం రూరల్ మండలం ఏఈగా బదిలీపై వెళ్లారు. అయితే అయినవిల్లి ఎలక్ట్రికల్ ఏఈ పోస్టు భర్తీ కాకపోవడంతో మరలా ఆయన్నే ఇన్‌చార్జ్ ఏఈగా నియమించారు. ఆయనను సబ్‌స్టేషన్ పరిధిలో సిబ్బంది కలసి అభినందించారు.

స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలి

యానాం: నియోజకవర్గ పరిధిలో వివిధ జూనియర్ కళాశాలలు, పలు విద్యా సంస్థల్లో చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు 2022–23కి గాను పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు త్వరగా మంజూరు చేయాలని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు ఖాతాలకు కేవైసీ ప్రక్రియ పూర్తి కాక స్కాలర్ షిప్ నగదు అకౌంట్లలో జమ కాలేదన్నారు. ఆది ద్రావిడ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.